ప్రజా సమస్యలకు సత్వర పరి ష్కారం

- కలెక్టర్ విజయేందిర బోయి
- ప్రజావాణికి 70 వినతులు, ఫిర్యాదులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 30: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్ రావు, ప్రభుత్వ శాఖల ఉన్న తాధికారులతో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులు ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 70 అర్జీలు అందాయి. ప్రధానంగా భూ సమస్యల తోపాటు ఫించన్లు, రెండు పడకగదుల ఇళ్లు, కారుణ్య నియామకాలు, ఆస్తి వివాదాలపై వచ్చాయి. వాటిలో కొన్ని ఇలా..

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

పత్తికొనుగోలుకు పకడ్బందీ చర్యలు

వానకాలం పత్తి కొనుగోలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వానకాలం పత్తి కొనుగోలు జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం పత్తికి క్వింటాకు రూ.7521 మద్దతు ధర ఉందని రైతులు తేమ శాతం 12కు మించకుండా కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, వ్యవసాయ, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, తూనికలు, కొలతలు శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లులు, పత్తి రైతులు పాల్గొన్నారు.

నేడు వయోవృద్ధుల దినం

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ జరీనా బేగం సోమవారం ప్రకటనలో తెలిపారు.

మహిళలకు ప్రాధాన్యమివ్వాలి

భూత్పూర్, సెప్టెంబర్ 30: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో మహిళలకు ప్రాధాన్య మివ్వాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. సోమవారం కలెక్టర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించారు. అధికారులందరూ ఉన్నారా? అని ఎంపీడీవో ప్రభాకరాచారిని అడిగారు. అనంతరం పీహెచ్‌సీలో జీపీ కార్మికుల కోసం నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారని డాక్టర్‌ను అడిగారు. మహిళలకు అవసరమైతే గైనకాలాజీకి సంబంధించిన పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రహమాన్, కమిషనర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ రబ్బు, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మూసాపేట, సెప్టెంబర్ 30: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ విజయేందిరబోయి పేర్కొన్నారు. సోమవారం మూసాపేట ఆదర్శ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని సంకలమద్ది వద్ద ఆదర్శ మహిళా సెంటర్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఏపీఎం వెంకటాచారి, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రేషన్ డీలర్లకు గౌరవవేతనం, క్వింటాకు రూ.300 కమీషన్ ప్రకటించాలి. ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలి. రూ.10లక్షల ఇన్సూరెన్స్, ఆరోగ్య కార్డులు జారీ చేయాలి.

– తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం

పంటపొలాల్లో మైనింగ్ నిలిపివేయాలి

నక్కలకుచ్చలో నాలు గుతరాలుగా పంటలు సాగుచేస్తూ జీవిస్తున్నాం. అధికారులు నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్‌కు ఇవ్వడంతో పొలాలన్నీ బీడువారాయి. 25కుటుంబాలు జీవనం కోల్పోయాయి. అధికారులు క్షేత్రపరిశీలన చేసి రైతు కుటుంబాలకు న్యాయం చేయాలి.

– గోవిందపల్లితండా రైతులు, గండీడ్ మండలం

బినామీ వాహనాలు తొలగించాలి

ప్రభుత్వ శాఖల్లో అధికారులు సొంత వాహనాలు వినియోగిస్తూ.. ట్యాక్సీప్లేట్ పేరిట ఫేక్ బిల్లులతో అక్రమ ఆదాయం పొందుతున్నారు. అద్దె బిల్లులు, అధికారుల వాహనాలు పరిశీలిస్తే స్వయం ఉపాధికి కార్లు తెచ్చుకున్న నిరుపేద డ్రైవర్లకు న్యాయం జరుగుతుంది.

– ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్స్ నాయకులు

బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ నాయకుడి భూ కబ్జా

పాల కొండ శివారులోని బైపాస్ రోడ్డులో భూమిని కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి తన స్నేహితుడని చెప్పుకుంటూ అక్రమానికి తెరలేపారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిని కాపాడాలి.

– నయీమ్ ఇమ్రాన్, టీచర్స్‌కాలనీ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ముచ్చింతల వద్ద చెక్‌డ్యాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), సెప్టెంబర్ 30: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కౌకుంట్ల మండలం ముచ్చింతల–నెల్లి కొడి శివారులోని ఊకచెట్టు వాగులో రూ.15.29కోట్లు, అప్పంపల్లి శివారులో రూ.12.50కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంలను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేవి ధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

మూసాపేట/భూత్పూర్, సెప్టెంబర్ 30: భూత్పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మెల్యే జీఎమ్మార్ 6300మంది లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్ రాయితీ పత్రాలను అందజేశారు. మూసాపేట బస్టాండ్ ఆవరణలో మూసాపేట, అడ్డాకుల మండలాలకు చెందిన లబ్ధిదారులకు కూడా పత్రాలను అందజేశారు. అనంతరం మూసాపేట సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు మండలంలో ఈత వనాల పెంచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరచారి, తాసీల్దార్ రహమాన్, కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీదేవి, మాజీ ఎంపీపీ శేఖర్‌రెడ్డి,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నవీన్‌గౌడ్, మాజీ ఎంపీపీలు నాగార్జునరెడ్డి, కృష్ణయ్య, మాజీ జెడ్పీటీసీలు రామన్‌గౌడ్, బాల్‌నర్సింహులు, మాజీ వైస్ ఎంపీపీ రాధిక, ఎంపీడీవోలు కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- పేట శిక్షణ కలెక్టర్ గరిమనరుల

కార్మికులను సన్మానిస్తున్న శిక్షణ కలెక్టర గరిమనరుల

మరికల్, సెప్టెంబర్ 30: జీపీ కార్మికుల సేవలు వెలకట్టలేనివని నారాయణపేట శిక్షణ కలెక్టర్ గరిమనరుల పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జీపీ కార్మికులను పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పంచాయతీ కార్మికులు చేసిన సేవలకుగానూ వారిని సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండన్న, ఎంపీవో పావని, పంచాయతీ కార్మదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: జిల్లాలో ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పదో తరగతికి జిల్లాకేంద్రంలోని ఉన్నత పాఠశాల(గ్రౌండ్), ఇంటర్‌కు బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 166 మంది, ఇంటర్‌లో 350 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. డీఈవో అబ్దుల్ ఘనీ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట డప్పు కళాకారుల నిరసన

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న డప్పు కళాకారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 30: డప్పు కళాకారుల జీవితాల్లో మార్పు రావాలంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సాయం చేయాలని తెలంగాణ డప్పు కళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట డప్పు మోగించి తమ డిమాండ్ల సాధనకు నిరసన, ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మానవజాతి పురోగమనంలో డప్పు ప్రధాన పాత్ర పోషించిందన్నారు. భాష పుట్టకముందు సంకేతంగా డప్పును మోగించేవారన్నారు. నాగరికతలో మొదటి సంగీత వాయిద్యం కూడా డప్పేనని పేర్కొన్నారు. డప్పు కళాకారులు వివిధ శుభ, అశుభ రాజకీయ పార్టీల ర్యాలీలు, సభలు, సమావేశాలు, ప్రభుత్వ పథకాల ప్రచారకర్తలుగా నిరంతరం డప్పులు కొడుతూ జీవనాన్ని కొనసాగిస్తున్నా.. చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితం గడుపుతూ అనేక వ్యవప్రయాసాలకు గురవుతున్నారని తెలిపారు. పాలకుల నిర్లక్ష్యంతో రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అణచివేస్తూ దళితుల్ని కనీసం మనుషులుగా సైతం గుర్తించడం లేదని వాపోయారు. డప్పు కళాకారుల అభివృద్ధికి జీవన ప్రమాణాల మెరుగుదలకు న్యాయమైన డిమాండ్లను సహృదయంతో పరిశీలించి ఆదుకోవాలంటూ కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల మూరు శ్రీను, రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- 3 తులాల బంగారు ఆభరణాలు రికవరీ: సీఐ ఆదిరెడ్డి

జడ్చర్లలో చోరీ కేసులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి

జడ్చర్ల, సెప్టెంబర్ 30: జడ్చర్లలోని వివిధ ప్రాంతాల్లోని ఇండ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన చిట్యాల రవి, లింగాల మహేశ్ జడ్చర్ల పట్టణంలో మూడు చోట్ల చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. జూలై 30న భవానీనగర్‌లో వడ్ల గోపి ఇంట్లో జరిగిన చోరీ కేసులో 3గ్రాముల రింగులు, 4మాసాల చెవి కమ్మ ఈ కేసులో మొత్తం రికవరీ అయినట్లు తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 19వ తేదీన ఇంపీరియల్ గార్డెన్ ప్రాంతంలోని నరేంద్ర సాగర్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో బంగారు ఉంగరం రికవరీ అయినట్లు తెలిపారు. నగదును నిందితులు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సెప్టెంబర్ 14వ తేదీన క్లబ్‌రోడ్డులోని అసదుఖాన్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో 1.25గ్రాముల బంగారు ఆభరణాలు, రెండుజతల కమ్మలు (7మాసాలు) రికవరీ అయినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. సమావేశంలో ఎస్సై శివానందం, పోలీస్ సిబ్బంది విష్ణు, నర్సింహరాజు ఉన్నారు.

నిబంధనలు అనుసరించి కొనుగోళ్లు చేయాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణ శివారులోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వానకాలం 2024 ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యం(సన్నరకం) కొనుగోలుకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి రైతులకు లబ్ధి చేకూర్చాలన్నారు. ఈసారి కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం, దొడ్డురకం ధాన్యంను వేర్వేరు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 1నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కొనుగోలు చేపట్టాలన్నారు. రవాణాపరంగా ఎలాంటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుదర్శన్ మాట్లాడుతూ.. కేంద్రాలలో 500 బస్తాలు నిల్వ కాగానే లారీలను తెప్పించుకొని లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమనరుల, డీఏవో జానకిసుధాకర్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ దేవదాస్, డీఎస్పీ లింగయ్య, ఆర్టీవో మేఘాగాంధీ, డీఆర్డీవో మొగులప్ప, ఏఈవోలు, కేంద్రాల నిర్వాహకులు, ప్రత్యేకాధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

సృజనాత్మకతను వెలికితీయాలి

యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. జాతీయ యువజన ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ మేళా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్, డీఈవో అబ్దుల్ ఘనీ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజావాణికి మొత్తం 35 ఫిర్యాదులు వచ్చినట్లు ఏవో జయసుధ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

మూసాపేట, సెప్టెంబర్ 30: మండలంలోని కొమిరెడ్డిపల్లి శివారులో గుట్టకాడిపల్లె వద్ద గుట్టపై చెన్నకేశవ స్వామి ఆలయం హుండీని గుర్తు తెలియని దుండగులు చోరీ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. ఆలయ పూజారి నారాయణ కథనం ప్రకారం.. స్వామివారి ఆలయానికి రోజూమాదిరిగానే సోమవారం ఉదయం వచ్చి చూడగా తలుపులకు ఉన్న తాళం పగులగొట్టి ఉన్నది. పైకి వెళ్లి చూడగా ఆలయంలో హుండీ కనిపించలేదు. ఈ విషయంపై గ్రామ పెద్దలకు తెలపడంతో గ్రామస్తులంతా వచ్చి పరిసరాలను పరిశీంచి చూడగా.. హుండీని బద్దలు కొట్టి అందులో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

యోగాతో రుగ్మతలకు పరిష్కారం

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 30: యోగాతో అనేక రుగ్మతలకు పరిష్కారం దొరుకుతుందని విశ్వమానవత సేవా సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో పతంజలి యోగా సమితి సహకారంతో విశ్వ మానవత సేవా సంస్థ నేతృత్వంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య నమస్కారాలు, యోగా ఆసనాలు, ప్రాణాయామాలు, యోగా క్రియలతో వివిధ రకాల రుగ్మతలను ఎలా పరిష్కరించుకోవచ్చో తెలియజేశారు. సరైన ఆహారం, దినచర్యతో రోగాలను ఎలా నివారించవచ్చో వివరించారు. అలాగే సిటిజన్ క్లబ్ ఆవరణలో విశ్వ మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో వైద్యులు శైలేంద్రకుమార్, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సురేశ్, విశ్వమానవత సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

'భూత్పూర్ రిజర్వాయర్ రైతులకు ప్రమాదం'

మక్తల్, సెప్టెంబర్ 30: సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో భూత్పూర్ రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ నర్వ మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్వలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయానికి గురైన తెలంగాణ ప్రాంతాన్ని బాగు చేయాలనే సంకల్పంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మక్తల్ మండలంలోని భూత్పూర్‌లో నిర్మించిన రిజర్వాయర్‌తో మక్తల్ నియోజకవర్గంలోని నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాల్లో 40వేల ఎకరాలకు సాగునీరు అందించాం.. రేవంత్‌రెడ్డి తప్పుడు నిర్ణయాలతో 1.3 టీఎంసీల భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నీళ్లు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం జీవోను విడుదల చేయడంతోపాటు ఇక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎలాంటి జోక్యం చేసుకోకుండా ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ నియోజకవర్గ రైతాంగానికి అన్యాయం చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఘనంగా బతుకమ్మ సంబురాలు

జడ్చర్ల, సెప్టెంబర్ 30 : జడ్చర్ల మున్సిపాలిటీలోని నాగసాల ప్రాథమిక పాఠశాలలో సోమవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీరొక్క పువ్వులతో బతుకమ్మను తయారుచేశారు. బతుకమ్మచుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆడారు. ఈ సంబురాల్లో కౌన్సిలర్ నవనీత కొండల్, హెచ్ఎం సావిత్రి, ఉపాధ్యాయురాలు సుమాదేవి పాల్గొన్నారు.

నాగసాల పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో..

జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను తయారుచేసి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు.

బావిలో పడి వ్యక్తి మృతి

బాలానగర్, సెప్టెంబర్ 30 : బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని హేమాజీపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఈశ్వరయ్య (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఈశ్వరయ్య ఈనెల 27వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి పోయాడని, సోమవారం గ్రామ శివారులోని పాడుబడిన బావిలో శవమై కనిపించాడని పోలీసులు తెలిపారు. మృతుని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సులో గుండెపోటుతో వ్యక్తి మృతి

హన్వాడ, సెప్టెంబర్ 30: మండలంలోని గుడిమాల్కాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు(43)హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్సులో వస్తుండగా.. గుండెపోటు రావడంతో ప్రయాణికులు గమనించి సీపీఆర్ చేసినా అప్పటికే మృతిచెందనట్లు ప్రయాణికులు తెలిపారు. ప్రయాణికులు ఆంజనేయులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో బస్టాండ్‌కు వచ్చి మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో కూలీ పని చేసేవాడని, భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ ఎంపికలు

క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ ఆర్గనైజేషన్

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అర్బన్ స్థాయి క్రీడా పోటీల ఎంపికలు సోమవారం ముగిశాయి. అండర్–14, 17 వాలీబాల్ విభాగంలో 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఆర్గనైజింగ్ సెక్రటరీ విలియం, ఏఎంవో శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడల్లో రాణించిన వారికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాధిక్ ఖాన్, రవీందర్ రెడ్డి, జ్యోతి, అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 30: దసరా పండుగను పురస్కరించుకొని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిపో పరిధిలో 649 ప్రత్యక బస్సులను నడుపుతున్నట్లు ఆర్ఎం శ్రీదేవి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలు, శుభకార్యాలు ఉన్నందున ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని టీజీఆర్టీసీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 11వ తేదీవరకు రీజినల్ పరిధిలోని మహబూబ్‌నగర్–69, నారాయణపేట–54, అచ్చంపేట–105, గద్వాల–89, కల్వకుర్తి–67, కొల్లాపూర్–58, నాగర్‌కర్నూల్–53, షాద్‌నగర్–59, వనపర్తి–95 డిపోలో బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

అభివృద్ధి శ్రామికుడు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే ఆల పుట్టిన రోజు వేడుకలు
- పండ్లు, మిఠాయిల పంపిణీ

దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అభివృద్ధి శ్రామికుడని.. బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నియోజకవర్గ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు. పండ్లు పంపిణీ చేశారు.

– మహబూబ్‌నగర్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ సెప్టెంబర్ 30

దేవరకద్రలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు

మూసాపేటలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అడ్డాకులలో కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిన్న చింతకుంటలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేక్ కట్‌చేస్తున్న భూత్పూర్ నాయకులు